క్లుప్తంగా

అధికారుల కృషితో సమస్యల పరిష్కారం



విద్య,సంక్షేమాధికారులతో ఎస్ఎఫ్ఐ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు, కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా కమిటీ ధన్యవాదాలు తెలియజేసింది. ఈ మేరకు జిల్లా విద్యా, సంక్షేమాధికారులతో ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ వెంకటేష్, పి. రామ్మోహన్ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి అధికారులు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

ఎంఆర్ సంస్కృత కళాశాలలో 'ఫెస్ట్ 2కే23'



వేడుకల్లో పాల్గొన్న బోధనా సిబ్బంది, విద్యార్థులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాలలో 'ఫెస్ట్ 2కే23' వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగి సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జనార్దన నాయుడు మాట్లాడుతూ, కొత్తగా వచ్చిన విద్యార్థులు సీనియర్స్, అధ్యాపకులు చెప్పే మంచి విషయాలు శ్రద్ధగా నేర్చుకోర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుభ, ఎంఆర్ ప్రభుత్వ సంస్కృత కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.గౌరీశ్వరరావు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండకరకాంలో 'ఈచ్ వన్ - రీచ్ వన్'



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

విజయనగరం రూరల్: మండలంలోని కొండకరకాంలో సీతం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఈచ్ వన్ – రీచ్ వన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా చేపట్టిన 'ఈచ్ వన్ - రీచ్ వన్' కార్యక్రమంలో భాగంగా కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థులు, అధ్యాపకుల బృందం గ్రామాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాలను సంరక్షించడం, ప్లాస్టిక్ నివారణ, పారిశుధ్య నిర్వహణ, తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు, అధ్యాపకుల బృందాన్ని కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి అభినందించారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న బ్యాంక్ సిబ్బంది

విజయనగరం అర్బన్: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంక్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. బ్యాంక్ ఉద్యోగులు 35 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ, 18 ఏళ్ల నుంచి 64 ఏళ్ల వరకు ఎవరైనా రక్తదానం చేయవచ్చని సూచించారు. బ్యాంక్ క్లస్టర్ హెచ్‌డీ సూర్య నాదేళ్ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు ఎం.వెంకటేశ్వరరావు, ఎం.సుధ, బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ వీరబాబు, ఆపరేషన్స్ మేనేజర్ సాయికుమార్ ముత్యాల, ఎస్‌వీఎస్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ నాగేశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ సురేష్

భోగాపురం: సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుని గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని ఈఓపీఆర్‌డీ సురేష్ సచివాలయ సిబ్బందికి సూచించారు.. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలన విధానంపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచాయతీల్లో ఉన్న సమస్యలను పరిస్థితులను బట్టి ఎప్పటికప్పుడు పరిష్కరించుకునేందుకు వీలుగా స్థానిక సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులతో కలిసి గ్రామసభలు, సాధారణ, అత్యవసర, ప్రత్యేక సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, ఏపీఓ ఆదిబాబు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే..

'ఆడుదాం ఆంధ్రా'

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- కార్యదర్శులు, నియోజకవర్గ కో ఆర్డినేటర్లకు క్రీడా పరికరాల పంపిణీ



సచివాలయ కార్యదర్శులకు క్రీడా పరికరాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం అతిపెద్ద క్రీడా సంబరంగా నిలవనుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఈ పోటీల్లో 15 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసు గల వారంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ క్రీడా మైదానం ప్రాంగణంలో సచివాలయ కార్యదర్శులు, నియోజకవర్గ స్థాయి కో ఆర్డినేటర్లకు శుక్రవారం క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. ముందుగా ఆడుదాం ఆంధ్రా లోగోను ఆవిష్కరించారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగా క్రీడారంగానికి సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. ఈనెల 15 నుంచి సచివాలయ స్థాయిలో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నీ కాయిట్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేటర్లు కంటుభుక్త తవిటిరాజు, కనకల నాగవల్లి, సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి అచ్యుత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కార్యదర్శులకు క్రీడాకిట్లు అందజేస్తున్న జేసీఎస్ కన్వీనర్, ఎంపీడీఓ, తదితరులు

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయండి

పూసపాటిరేగ: ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయాలని జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయం కార్యదర్శులకు ఆడుదాం ఆంధ్రాకు సంబంధించిన క్రీడా పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామస్థాయి క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామస్థాయి విజేతలు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.రాధిక, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి..



భోగాపురం: ఎ. రావివలస సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

- వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ఎ రావివలసలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రావివలస సచివాలయ పరిధిలో లబ్ధిదారులకు చేకూరిన సంక్షేమ పథకాల వివరాలు పొందుపరిచిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రావివలస పరిధిలో ఉన్న ప్రజలకు రూ. 20.79 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, ఉప్పాడ విజయభాస్కర్‌రెడ్డి, నరసింహనాయుడు, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, ఈఓపీఆర్‌డీ సురేష్, సీడీపీఓ ఎస్తేరురాణి, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి..

పూసపాటిరేగ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వెల్దూరు సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించడంతో పాటు పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం. రాధిక, ప్రజాప్రతినిధులు దారపు అప్పలసూర్రెడ్డి, నాగరాజు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటిని బయటకు పంపించాలి..



భోగాపురంలో నెలకొరిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి హరికృష్ణ



రైతులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

భోగాపురం: మిచాంగ్ తుఫాన్ ప్రభావం వల్ల వరి పొలాల్లో చేరిన నీటిని బయటకు పంపించాలని మండల వ్యవసాయాధికారి వి. హరికృష్ణ రైతులకు సూచించారు. మండల కేంద్రంలో నేలకొరిగిన వరి పంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పొలాల్లో కాలువలు తీసి నీటిని బయటకు పంపించాలన్నారు. తడిసిన వరి పనలను గట్టు మీదా లేదా ఎత్తైన ప్రదేశాల్లో ఉంచి వాటిని ఎకరాకు 25 కిలోల గళ్ల ఉప్పును చల్లాలని తెలిపారు. అలాగే పడిపోయిన వరి పంటను పైకి ఎత్తి కట్టుకుని ఐదు శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. ప్రభుత్వం నుంచి విధివిధానాలు వచ్చిన వెంటనే పంటనష్టం అంచన వేయనున్నట్లు తెలిపారు.

రైతులను ఆదుకోవాలి: సీపీఐ

నెల్లిమర్ల: తుఫాన్ ధాటికి పంటలు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ. 40 వేలు చొప్పున నష్ట పరిహారం అందజేసి ఆదుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. జరజాపుపేటలో సీపీఐ నాయకులు బుగత అశోక్, తాలాడ సన్నిబాబు, మొయిద పాపారావు, బాలి గౌరినాయుడు శుక్రవారం పర్యటించి, పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ఓదార్చారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన

నెల్లిమర్ల: నియోజకవర్గ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఈవీఎంల వినియోగంపై ఎన్నికల అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎలక్షన్ డీటీ ఎంవీవీఎస్ మూర్తి మాట్లాడుతూ, నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ 60 రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ప్రసన్నకుమార్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలి

- ఏఓ పూర్ణిమ



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ పూర్ణిమ

నెల్లిమర్ల: రబీ సీజన్‌లో సాగు చేయనున్న మినప, పెసలు, రాగులు, వేరుశనగ పంటలకు సంబంధించి కావాల్సిన విత్తనాలకు రైతులు ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ ఎం. పూర్ణిమ తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జమ్ము అప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మండలంలో 4895 ఎకరాలకు సంబంధించి ఈ పంట నమోదు జరిగిందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని విక్రయించేందుకు ఆర్‌బీకేల్లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

సాధన యువజన సంఘ సభ్యుల ఔదార్యం



రక్తదానం చేస్తున్న సాధన సభ్యులు

నెల్లిమర్ల: జరజాపుపేటకు చెందిన సాధన యువజన సంఘ సభ్యులు రక్తదానం చేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే... ఎం. కీర్తన అనే గర్భిణి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఈమెకు అత్యవసరంగా మూడు యూనిట్ల ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో కుటుంబ సభ్యులు సాధన యువజన సంఘ అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్‌ను సంప్రదించారు. దీంతో దుర్గాప్రసాద్ సూచన మేరకు సభ్యులు డి.వికాష్, డి. అవినాష్ శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదానం చేశారు.

కోరికలను జయించాలి..



ఆధ్యాత్మికవేత్త సుశీలాజీని సత్కరిస్తున్న కళాశాల చైర్మన్, సెక్రటరీ, ప్రిన్సిపాల్, తదితరులు

డెంకాడ: లక్ష్య సాధనపై పట్టు సాధించాలంటే కోరికలను జయించాలని పూణేకు చెందిన ఆధ్యాత్మికవేత్త సుశీలాజీ సూచించారు. జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో వ్యక్తిత్వ వికాస తరగతుల్లో భాగంగా సంస్థ యూనివర్సల్ హ్యూమన్ సెల్, ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ సెల్ సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భావోద్వేగాల నియంత్రించగలిగితే ఆనందమయ జీవితం గడపవచ్చన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి మాట్లాడుతూ, విద్యకు మానవతా విలువలు జోడిస్తేనే జీవితానికి అసలైన సార్థకత ఏర్పడుతుందని చెప్పారు. అనంతరం సుశీలాజీని సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ పి.మధుసూదనరావు, సెక్రెటరీ కె.శివరామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ తమ్మినేని హరిబాబు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, ఫెమినావింగ్ కోఆర్డినేటర్లు జానకి, తిరుమల, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే అందరికీ న్యాయం



ఎమ్మెల్యే బడ్డుకొండతో కావూరి జయకుమార్

పూసపాటిరేగ: జగనన్న పాలనలో దళిత, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరిగిందని జగనన్న అభిమాన సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు కావూరి జయకుమార్ అన్నారు. జగన్ మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని ఆకాంక్షిస్తూ వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు సెప్టెంబర్ 12న ప్రారంభించిన చైతన్య రథయాత్ర 82వ రోజైన శుక్రవారం నాటికి డెంకాడ మండలం మోపాడకు చేరుకుంది. దీంతో జయకుమార్ స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును కలిశారు. రథయాత్ర విజయవంతం కావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జయకుమార్ మాట్లాడుతూ, డిసెంబర్ 21వ తేదీ నాటికి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ఉన్న జగనన్న ప్రజాసంకల్ప పాదయాత్ర విజయస్తూపం వద్దకు చేరుకుంటామన్నారు. రథయాత్రలో భాగంగా జగనన్న ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నట్లు చెప్పారు.

'హౌసింగ్ మెగా కంప్లీషన్'కు సహకరించాలి

- మండల ప్రత్యేకాధికారి వి. శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శ్రీనివాస్

నెల్లిమర్ల: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో హౌసింగ్ మెగా కంప్లీషన్‌కి అందరూ సహకరించాలని మండల ప్రత్యేకాధికారి, హౌసింగ్ పీడీ వి. శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం హౌసింగ్ డేను పురస్కరించుకొని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న ఇళ్ల త్వరితగతిన పూర్తి చేయడానికి హౌసింగ్ మెగా కంప్లీషన్ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటికీ పనులు ప్రారంభించని వారికి అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ జి.రామారావు, ఏఈ ఆర్. పవన్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరజాపుపేట జగనన్న కాలనీని సందర్శించారు. 75 ఇళ్లు పునాది స్థాయిలో, ఎనిమిది ఇళ్లు శ్లాబు స్థాయిలో ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలు అరికట్టడానికే సామాజిక తనిఖీలు



సామాజిక తనిఖీల పై ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

విజయనగరం రూరల్: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు అరికట్టడానికే సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ జి. ఉమామహేశ్వరి అన్నారు. 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీల ప్రజావేదిక కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందాలు ఇటీవల గ్రామసభల ద్వారా తాము గుర్తించిన లోటుపాట్లను ప్రజావేదికపై ప్రస్తావించారు. విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు మాట్లాడుతూ, ఉపాధి పనుల్లో సామాజిక తనిఖీలు కీలకమని తెలిపారు. అవకతవకలకు చోటు లేకుండా పారదర్శకంగా పనులు చేపడితే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీడీ జనార్దనరావు, ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఏపీఓ లక్ష్మణ్, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ మాధవరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు



పూసపాటిరేగ : కుమిలిద్వాదశ దేవాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేస్తున్న భక్తులు



నెల్లిమర్ల రూరల్: సత్యనారాయణ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేటలో ఉన్న సత్యనారాయణస్వామి ఆలయంలో ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామికి పంచామృతాలతో విశేష అభిషేకాలు జరిపించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అలాగు పెద బూరాడపేటలో ఉన్న బాలా త్రిపుర సుందరీదేవి ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు జరిపించారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి ద్వాదశదేవాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఘనంగా జరిగాయి. కార్తీక బహుళ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని భక్తులు వ్రతాలు నిర్వహించారు. వేదపండితులు కొమల్లాపల్లి మల్లి కామేశ్వరరావు, కొమల్లాపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు నీలాపు రాజారెడ్డి, నీలాపు బ్రహ్మానందరెడి, గ్రామ ప్రజాప్రతినిధి గుజ్జు సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తూర్పుకాపుల కార్తీక వనసమారాధన రేపు



సమావేశంలో మాట్లాడుతున్న తూర్పుకాపు సామాజిక వేదిక ప్రతినిధులు

విజయనగరం: తూర్పు కాపు సామాజిక వేదిక ఆధ్వర్యంలో ఈనెల 10న తూర్పుకాపు కార్తీక వనసమారాధన నిర్వహించనున్నట్లు వేదిక ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం స్థానిక తూర్పు కాపు సామాజిక వేదిక భవనంలో సంఘ జిల్లా అధ్యక్షుడు రొంగలి రామారావు, ప్రధాన కార్యదర్శి ముదిలి నాగభూషణం, ముఖ్య సలహాదారు గిరడ అప్పలనాయుడు, తదితరులు మాట్లాడుతూ.. విజయనగరం, పార్వతీపురం – మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన తూర్పు కాపులంతా సమారాధనకు హాజరుకావాలని కోరారు. సమావేశంలో తూర్పు కాపు సామాజిక వేదిక ఉపాధ్యక్షులు అంబళ్ల అప్పలనాయుడు, పిన్నింటి చంద్రమౌళి, కోశాధికారి తాటికాల వెంకటరమణ, లీగల్ సలహాదారు చందక చిన్న, ముఖ్య సలహాదారులు పిన్నింటి సూర్యనారాయణ, నడిపిల్లి ఆదినారాయణ, చెల్లూరి రమణ, తదితరులు పాల్గొన్నారు.